సావిత్రి స్మారక లలిత సంగీత పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో ఏపీఏ సావిత్రి ఆధ్వర్యంలో ఏవీ సావిత్రి స్మారక లలిత సంగీత పోటీలను నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, కార్యదర్శి సుధారాణి తెలిపారు. సోమవారం సాయంత్రం వారు వివేక్‌నగర్‌లో మాట్లాడుతూ... జంట నగరాలకు చెందిన యువ గాయనీగాయకులు పోటీలలో పాల్గొనవచ్చని అన్నారు. సబ్ జూనియర్ (8 నుంచి 12 సంవత్సరాలు), జూనియర్ (13 నుంచి 16 సంవత్సరాలు), సీనియర్ (17 నుంచి 23 సంవత్సరాలు) విభాగాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తిగల వారు ఆగస్టు 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం .95154 13349లో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యాబోధన చేసేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఇంగ్లీష్, సంస్కృతం, అరబిక్, కామర్స్, ట్యాక్సేషన్, ఫైనాన్స్ (ఎం.కామ్ అర్హత), హెచ్‌ఆర్ ఆపరేషన్స్ (ఎం.కామ్ అర్హత), బీబీఏ, బీబీఏ (ఈ–కామ్, ఆపరేషన్స్), పొలిటికల్ సైన్స్, డిజిటల్ మార్కెటింగ్ (మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పీజీ అర్హత), బోటనీ, అప్లైడ్ న్యూట్రిషన్ బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఫార్మా, సైకాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెకానికల్ లెర్నింగ్, బీసీఏ అండ్ గేమింగ్ కోర్సుల్లో బోధన చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలకు లోపు కళాశాలలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు.

ఎన్‌ఎస్‌యూఐని రద్దు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్‌ఎస్‌యూఐని రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎన్ఎస్‌యూఐ ఒడిశా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థినులపై జరిగే లైంగిక దాడుల వెనుక ఎన్ఎస్‌యూఐ నేతల హస్తం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పృథ్వీతేజ, అలివేలి రాజు, హరిప్రసాద్, కమల్ సురేష్, ఉదయ్, వినయ్, సాయి తేజ, దృహస్, శివ శంకర్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజనీరింగ్ చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ..బీసీ విద్యార్థులకు ర్యాంకులతో సంబంధంలేకుండా బోధన ఫీజు మొత్తాన్ని చెల్లించాలని లేఖ ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. 10 వేల లోపు ర్యాంక్ విద్యార్థులకు మొత్తం ఫీజును చెల్లిస్తూ 10 వేల ర్యాంక్ దాటిన విద్యార్థులకు కేవలం రూ.35 వేలు మాత్రమే చెల్లించడం వలన మిగత ఫీజును చెల్లించలేక అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఇతర కులాల విద్యార్థులకు ర్యాంక్‌లతో సంబంధం లేకుండా ఫీజులు చెల్లిస్తున్నట్లు బీసీలకు కూడా మొత్తం ఫీజు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బీఏఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీఏఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీఏఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తీగల శివకుమార్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక తెలంగాణ సాధించడమే లక్ష్యమని రానున్న స్థానిక ఎన్నికల్లో ఆజాద్ సమాజ్ పార్టీ పోటీ చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జహంగీర్, షేక్ అమిర్ ఘెష్, ఎండీ మోయిన్, అయేషా సుల్తానా, ఫరిన్ బేగం, శోభన్ బాబు, గడ్డం ప్రవీణ్, అరుణ్ పాల్గొన్నారు.

రైలు బోగీ నుంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: నడుస్తున్న రైలు బోగీ నుంచి జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కే.నారాయణ తెలిపిన వివరాల ప్రకారం..చర్లపల్లి–ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య గల రైల్వే ట్రాక్ పక్కన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు పోలీసులకు ఆదివారం రాత్రి 10 గంటలకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అంబులెన్స్‌ను రప్పించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కొద్ది గంటల పాటు చికిత్స పొందిన ఆ వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఘటన స్థలంలో పరిస్థితులకు బట్టి సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు బోగీ నుంచి జారి పడి గాయపడ్డట్టు తెలుస్తుందని వారు చెప్పారు. మృతుడి ఒంటిపై మెరూన్ కలర్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మన సాంస్కృతిక వైభవం
బోనాల సంబురం..!

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో కనుల పండువగా బోనాల జాతర

పోతరాజుల ఆట..



పోతరాజుగా బాలుడు.. బోనమెత్తిన బాలిక

యువత సయ్యాట..!



ముషీరాబాద్‌లో చిందేసి ఉత్సాహ పరుస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

అంబర్‌పేటలో భవిష్యవాణి వినేందుకు భారీగా తరలి వచ్చిన భక్తజనం





అంబర్‌పేట మహంకాళి ఆలయం వద్ద చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

బోనాల జాతర రెండో రోజు ఫలహారం బండ్లు, తొట్టెల ఊరేగింపు, బలిగంపు, భవిష్యవాణి తదితర కార్యక్రమాలు తెలంగాణ సంస్కృతి పునర్‌వైభవాన్ని మళ్లీ గుర్తుచేశాయి. దప్పుచప్పుళ్ల మధ్య పొటేళ్లతో ఫలాహారం బండిని లాగిస్తూ నిర్వాహకులు కనిపించారు. ఈ క్రమంలో పోతరాజుల ఆట అందరినీ ఆకట్టుకుంది. తొట్టెల, ఫలాహారం బండ్ల నిర్వాహకులు ఊరేగింపుగా వెళ్లి అంబర్‌పేట, నింబోలిఅడ్డ మహంకాళి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఆలయం వద్ద బోనాల జాతర చూడ ముచ్చటగా సాగింది. పోతరాజులతో కలిసి యువత తీన్మార్ స్టెప్పులు వేస్తూ ఆనందంగా కనిపించారు. అదేవిధంగా పౌరాణిక కళాకారులు అమ్మవార్ల వేష ధారణలో వారు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బోనాల జాతర తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుట్ల కవిత చెప్పల్‌బజార్‌లో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుమల కృష్ణారెడ్డి తదితరులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం



అంబర్‌పేట మహంకాళి ఆలయ ఆవరణలో భవిష్యవాణి వినిపిస్తున్న ఏర్పుల విజయ్‌కుమార్



లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి కట్టమైసమ్మ ఆలయానికి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ ఫౌండర్ చైర్మన్ గోల్కొండ గౌతమ్‌కుమార్ పటేల్ తదితరులు



భరత్‌నగర్‌లో శ్రీకాంత్ నిర్వహించిన ఫలహారబండ్ల ఊరేగింపులో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు



బాబపూజీనగర్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ సుప్రియ తదితరులు



ముషీరాబాద్ మహంకాళి ఆలయంలో జరిగిన పూజల్లో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



గాంధీనగర్‌లో ఫలహారం బండ్ల ఊరేగింపులో బీజేపీ నేత వినయ్‌కుమార్



బోనాల వేడుకల్లో బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి



ముషీరాబాద్‌లో ఫలహార బండ్ల ఊరేగింపులో ఎమ్మెల్సీ కవిత తదితరులు



కాచిగూడలో ప్రతిష్ఠించిన అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నర్సింహబస్తీలో తొట్టెల ఊరేగింపులో ఎస్సీ మోర్చా నేత లక్ష్మణ్‌కుమార్



నింబోలిఅడ్డ తొట్టెల ఊరేగింపులో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేసరి నర్సింగ్‌యాదవ్



ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన బోనాల వేడుకలో చిన్నారులు



అంబర్‌పేటలో ఫలహారం బండి ఊరేగింపులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు



కాచిగూడలో జరిగిన ఫలహారం బండి ఊరేగింపులో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, కార్పొరేటర్ ఉమారాణి



మహాత్మానగర్ ఊరేగింపులో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జి కనకేష్ తదితరులు

నా భక్తులకు ఇబ్బందులు రానివ్వను

ముషీరాబాద్ మహంకాళి దేవాలయంలో జరిగిన భవిష్యవాణిలో స్వర్ణలత



మహంకాళి ఆలయంలో పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి వినిపిస్తున్న స్వర్ణలత

ముషీరాబాద్: 'నా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వను'అని భవిష్యవాణిలో కుమారి స్వర్ణలత అన్నారు. సోమవారం ముషీరాబాద్ మహంకాళి దేవాలయంలో భవిష్యవాణి కార్యక్రమాన్ని స్వర్ణలతతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పచ్చి కుండపై నిలబడి భవిష్యవాణిని వినిపించారు. ప్రజలందరిని చల్లగా కాపాడుకుంటూ సుఖ సంతోషాలతో ఉంచుతానని అన్నారు. ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని పేర్కొన్నారు. కొంత మంది నియమ నిష్ఠలు పాటించకుండా పూజలు చేస్తున్నారని తెలిపారు. అలా చేసి తన కోపానికి గురికావొద్దని హెచ్చరించారు. తాను సంతోషంగా ఉండాలంటే గడప గడప నుంచి సాక పెట్టి ఐదు వారాలు పూజలు చేయాలని సూచించారు. ధన్వంతరి హోమం, దుర్గా సప్తసతి హోమం చేయాలని అప్పుడే శాంతిస్తానని పేర్కొన్నారు. ప్రజలను, పాడి పశువులకు ఎలాంటి ఆపద రానివ్వనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు చంద్రమౌళి, ఈవోలు మహేందర్ కుమార్, సత్యనారాయణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, వివిధ పార్టీల నాయకులు వై.శ్రీనివాస్‌రావు, శివ ముదిరాజ్, నర్సింగ్‌రావు, బాలరాజుయాదవ్, జెనిగె శ్రీనివాస్‌యాదవ్, పట్నం నాగభూషణంగౌడ్, లింగంగుప్తా తదితరులు పాల్గొన్నారు.



దత్తన్నకు సత్కారం

అంబర్‌పేట: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను బాగ్‌అంబర్‌పేటకు చెందిన బీజేపీ నాయకులు సత్కరించారు. ఇటీవల ఆయన గవర్నగా పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం బీజేపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.

బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి


బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లిస్తూ కేవలం బీసీలకు మాత్రమే ఫీజులు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఫీజుల పెంపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేమని చెప్పడం, పాలిటెక్నిక్ కోర్సుకు రూ.14,500 ఫీజును రూ.39వేలకు పెంచారన్నారు. ఫీజులను బీసీ విద్యార్థులే భరించాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థుల పట్ల సవితి తల్లి ప్రేమ చూపిస్తోందని ఆయన విమర్శించారు. బీసీ ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, మంత్రులు బీసీల పక్షాన నిలబడి బీసీ విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన కోరారు. లేని పక్షంలో బీసీ విద్యార్థులతో కలిసి విద్యార్థి ఉద్యమాన్ని పెద్ద ఎత్తున చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

24న ప్రంభన్ యాదవ్ సంతాప సభ

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక వేత్త దివంగత ప్రొ.ప్రంభన్ యాదవ్ సంతాప సభను ఈ నెల 24న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఏఐటీబీసీ జేఏసీ చైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్ సోమవారం పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమగు సభకు పార్టీలకు అతీతంగా బహుజనులు హాజరుకావాలని కోరారు.

గుదిబండి వెంకట్‌రెడ్డి మృతి కళారంగానికి తీరని లోటు



చిక్కడపల్లి: జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుదిబండి వెంకట్‌రెడ్డి ఆకస్మిక మరణం సాంస్కృతిక కళారంగానికి తీరని లోటని పలువురు ప్రముఖులు అన్నారు. రాష్ట్ర మాజీ సలహాదారు కేవీ రమణాచారి, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనామూర్తి, ప్రముఖులు ఎంకే రాము, లోకం కృష్ణయ్య, లంకా లక్ష్మీనారాయణ, సీహెచ్.త్రినాథరావు, రాఘవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సంతాపాన్ని ప్రకటించారు. వెంకట్‌రెడ్డి సాంస్కృతికె రంగానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (45) కాచిగూడ నింబోలిఅడ్డ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై శుక్రవారం తీవ్ర అనారోగ్యంతో ఉండగా చికిత్స కోసం పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని ఒంటిపై నీలి రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఘటోత్సవం, గంగతెప్ప పూజోత్సవం

కవాడిగూడ: లోయర్ ట్యాంక్ బండ్ కనకాల కట్ట మైసమ్మ దేవాలయం వద్ద సోమవారం ఆలయ ఫౌండర్ చైర్మన్ గోల్కొండ గౌతమ్‌కుమార్ పటేల్ మధ్యాహ్నం 12 గంటలకు ఘటోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు స్థానికంగా ఉన్న పింగళి వెంకట్ రామిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి బ్యాండ్ మేళాలతో ఊరేగింపుతో ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం నగరంలో ఎక్కడ లేని విధంగా మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి దేవాలయంలో హాజారి బలిహరణలు జరిపి ఊరేగింపుగా హుస్సేన్ సాగర్‌లోని గంగాదేవి పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

గండిపేట తర్వాత ఇక్కడే...

- నగరంలో గండిపేట తరువాత హుస్సేన్ సాగర్‌లో జరిగే గంగతెప్ప పూజోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు గావు కల్యాణంలో భాగంగా మండపంలో అమ్మవారిని ఆవాహనం చేసి కల్యాణం చేశారు. సాయంత్రం 7గంటలకు కుమారి స్వర్ణలత రంగం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోతురాజుల విన్యాసాలు, భారీ తొట్టెల ఊరేగింపు ఫలహారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సాంబశివరావు, ఆలయ ప్రధాన అర్చకులు సాత్విక శర్మ, సీనియర్ అసిస్టెంట్ సతీష్, జంటనగరాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

'వల్లంకి పిట్ట' పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి: మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సిటీ కల్చరల్ సెంటర్‌లో విశ్రాంత ఏపీ మైన్స్ డైరెక్టర్ డాక్టర్ వీడి రాజగోపాల్ రచించిన మానవత్వం నిలుపుకో.. సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు పాల్గొని తమ స్వీయ కవితలను అర్థవంతంగా చదివారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని రచయిత, కవులు, కవయిత్రులను అభినందించి సన్మానించారు. అనంతరం గద్వాల సోమన్న రచించిన వల్లంకి పిట్ట పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు రాధకుసుమ, ఏఎల్ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్, వీడి రాజగోపాల్, రాధకుసుమ, ఏఎల్ కృష్ణారెడ్డి

'దాశరథి కవిత్వాన్నే ఉద్యమభాషగా ఉపయోగించారు'



మాట్లాడుతున్న హాస్యావధాని శంకరనారాయణ

చిక్కడపల్లి: దాశరథి కవిత్వాన్ని సాహిత్య పరంగానే కాకుండా ఉద్యమభాషగా ఉపయోగించిన మహనీయుడని ప్రముఖ హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. త్యాగరాయ గానసభ నిర్వహణలో ప్రముఖ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్య యాదిలో.. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనలో ప్రజలపై జరుగుతున్న అరాచకాలు, అన్యాయానికి వ్యతిరేకంగా కవిత్వాన్ని ధిక్కార స్వరంగా మార్చారన్నారు. ఆయన రాసిన అగ్నిధార, రుద్రవీణ వంటి కవితా సంపుటిలలో ప్రజల పట్ల ఆవేదన, నిజాం పాలనపై వ్యతిరేకతను చాటారన్నారు. సినీగీతాల్లో సైతం సామాజిక చింతన ఉంటుందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు సీహెచ్ త్రినాథరావు, వెంకటరావు, లక్ష్మీశాంతి తదితరులు పాల్గొన్నారు.